సమరానికి సర్వం సిద్ధం

- నాలుగు నియోజకవర్గాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో ఓటర్ల సంఖ్య 9,66,330, 1,152 పోలింగ్ కేంద్రాలు
- 2,482 మందితో పటిష్ట బందోబస్తు

గజ్వేల్ : డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

సిద్దిపేట అర్బన్, మే 12 : జిల్లాలో లోక్ సభ ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రిని భారీ భద్రత మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,152 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో గజ్వేల్‌లో 322, హుస్నాబాద్‌లో 304, సిద్దిపేటలో 273, దుబ్బాకలో 253 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అదే విధంగా జిల్లాలో 9,66,330 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఎన్నికల నిర్వహణ కోసం 1,382 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,382 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 2,765 మంది అదర్ ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహించడంతో పాటు, 106 మంది మైక్రో అబ్జర్వర్లు 131 మంది రూట్ ఆఫీసర్లు విధులు నిర్వహించనున్నారు. నేడు ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాలు, కర్మాగారాలు, ఫ్యాక్టరీలు అన్నింటికీ వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేశారు.

జిల్లాలోని ఓటర్ల సంఖ్య 9,66,330

జిల్లాలో మొత్తం 9,66,330 మంది ఓటర్లు ఉండగా.. మహిళా ఓటర్లు 4,92,714 మంది.. పురుష ఓటర్లు 4,75,535 మంది ఉన్నారు. ఇందులో జిల్లాలోని హుస్నాబాద్(32) నియోజకవర్గంలో 2,37,591 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో మహిళలు 1,25,981 మంది ఉండగా.. పురుషులు 1,21,715 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. సిద్దిపేట(33) నియోజకవర్గంలో మొత్తం 2,37,591 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,21,084 మంది ఉండగా.. పురుషులు 1,16,436 మంది, ఇతరులు 71 మంది ఉన్నారు. దుబ్బాక(41) నియోజకవర్గంలో మొత్తం 2,00,125 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,02.927 మంది ఉండగా.. పురుషులు 97,198 మంది ఉన్నారు. గజ్వేల్(42) నియోజకవర్గంలో మొత్తం 2,80,913 మంది ఉండగా.. ఇందులో మహిళలు 1,42,722 మంది ఉండగా.. పురుషులు 1,38,186 మంది ఉండగా.. ఇతరులు ఐదుగురు ఉన్నారు.

2,482 మందితో పటిష్ట బందోబస్తు

లోక్ సభ ఎన్నికల కోసం జిల్లా వ్యాప్తంగా 2,482 మంది అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో 1,054 మంది కమిషనరేట్‌లో ఉన్న అధికారులు, సిబ్బంది, సాయుధ బలగాలు, హోంగార్డులు ఉండగా.. 450 మంది కేంద్ర బలగాలైన ఎస్ఎస్‌బీ, సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది, 978 మంది ట్రైనీ ఎస్సైలు, ట్రైనీ కానిస్టేబుళ్లు, ట్రైనీ ఎస్‌పీఎఫ్, తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసులు, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ నెల 14వ తేదీ ఉదయం 5 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ తెలిపారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న సిద్దిపేట సీపీ అనురాధ

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన సీపీ

సిద్దిపేట అర్బన్, మే 12 : జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం సీపీ అనురాధ సందర్శించారు. ఈ మేరకు రూట్ మొబైల్స్ స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, అధికారులు, సిబ్బందికి సీపీ అనురాధ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రాబోయే 48 గంటలు చాలా కీలకమని.. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, నిషేధిత వస్తువులు తీసుకొని రాకుండా చూడాలన్నారు. శాంతియుత, స్వేచ్ఛాపూరిత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఏసీపీ మధు, సీఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు

సిద్దిపేట అర్బన్ : ఇందూర్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామగ్రిని తీసుకెళ్లేందుకు సిద్ధమైన సిబ్బంది

దుబ్బాక టౌన్ : పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లే బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్వో గరిమా అగర్వాల్

సిద్దిపేట అర్బన్ : డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రిని బస్సులో తీసుకెళ్తున్న సిబ్బంది

మెతుకుసీమ ఆశాకిరణం..వెంకట్రామిరెడ్డి

మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఎన్నికల్లో విజయం సాధించకముందే నిస్వార్థంగా రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తానని చెప్పి మిగతా రాజకీయ నాయకులకు భిన్నంగా నిలిచారు. జేబునిండా డబ్బులు ఉన్నా..ఎవరైనా సహాయం కోరి వస్తే, వారికి చేస్తే నాకేమి వస్తుంది అని ఎనకా ముందు ఆలోచించే వ్యక్తులు ఉన్న నేటి సమాజంలో..నిస్వార్థంగా సమాజం కోసం తన కుటుంబ ఆస్తిని ప్రజాసేవ కోసం వినియోగించడానికి ముందుకు వస్తున్న వెంకట్రామిరెడ్డిది గొప్ప మనసు. ఎంపీగా గెలిస్తే సాధారణంగా ఎంపీ లాడ్స్ ద్వారా ఏడాదికి రూ.5 కోట్లకు గానూ 5 ఏండ్లకు రూ.25 కోట్ల నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉంటాయి. వాటిని ప్రజా అవసరాల కోసం అభివృద్ధి పనులకే వాడాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భంలో తాను ఎంపీగా గెలిచిన 30 రోజుల్లో రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి నిరుపేద యువతీ, యువకులకు అండగా నిలుస్తానని ప్రకటన చేసి వెంకట్రామిరెడ్డి సంచలనం సృష్టించారు, మెదక్ జిల్లాలో డ్వామా పీడీగా, జేసీగా, కలెక్టర్‌గా పనిచేసిన పి.వెంకట్రామిరెడ్డికి ఈ ప్రాంత ప్రజలతో ఎంతో అనుబంధం ఉంది. తాను రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేయడంతో పాటు మరో రూ.14 కోట్లతో మెదక్ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో 7 ఫంక్షన్‌హాళ్లు నిర్మించి నిరుపేదల శుభకార్యాల కోసం ఉచితంగా అందిస్తానని హామీ ఇవ్వడంపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధిలో చెరగని ముద్ర

మెదక్ జిల్లాలో 11 ఏండ్ల పాటు ఉన్నతాధికారిగా పనిచేసిన వెంకట్రామిరెడ్డి పనిమంతుడిగా పేరు తెచ్చుకున్నారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన జిల్లాలో పనిచేయడం, మంత్రి తన్నీరు హరీశ్‌రావు కూడా ఈ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహించడంతో కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో అతనిపై బాధ్యతలు పెరిగాయి. వారి ఆదేశాల మేరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో కొత్త పుంతలు తొక్కించారు. దేశంలోనే టాప్-10 జిల్లాల్లో ఒకటిగా సిద్దిపేటను తీర్చిదిద్దారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం మొదలు పెట్టినా సిద్దిపేట జిల్లాను అగ్రస్థానంలో నిలిపారు. రాత్రీపగలు తేడాలేకుండా కష్టపడి పనిచేసే తత్వం, సమయస్ఫూర్తి, పారదర్శకతతో పనిచేసే వ్యక్తి కావడంతో వెంకట్రామిరెడ్డికి ఎక్కువ మంది సీఎంల వద్ద పనిచేసే అవకాశం లభించింది. నారా చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, కేసీఆర్‌ల వద్ద పనిచేసే అవకాశం లభించింది. తిరుపతి, చిత్తూరు ఆర్డీవోగా, హుడా కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌గా, మెదక్ జేసీగా, గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీ (గడా) ఓఎస్డీ, సిద్దిపేట కలెక్టర్‌గా విజయవంతమైన పాత్ర పోషించారు. సిద్దిపేట జిల్లాలో కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతల ప్రాజెక్టులు అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌ల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. ముంపు గ్రామాల ప్రజలకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు నిర్మించి అందించారు. కేసీఆర్ ఫామ్ హౌస్ గ్రామాలు ఎర్రవల్లి, నర్సన్నపేటల అభివృద్ధికి ఇతోధిక కృషిచేశారు. సిద్దిపేటకు రైల్వేలైన్ కోసం ఎంతో శ్రమించారు. ఉదయం 7 గంటలకు కలెక్టరేట్‌కు వెళ్తే రాత్రి 11 గంటలకు బయటకు వచ్చేవారని అతనితో పనిచేసే అధికారులు చెబుతుంటారు. పని రాక్షసునిగా పేరు తెచ్చుకున్న హరీశ్‌రావుతో కలిసి సీఎం కేసీఆర్ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత ఆయనది. ఆయన పనితీరును చూసి మెచ్చుకున్న నాటి సీఎం కేసీఆర్ నువ్వు ప్రజల మనిషివి వెంకట్రామ్, నువ్వు రాజకీయ నాయకుడిగా ఉంటే ఇంకా ఎక్కువ సేవలు ప్రజలకు అందుతాయని పేర్కొని 2021లో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. కలెక్టర్‌గా పనిచేసిన వ్యక్తి ప్రజా సేవకోసం వస్తున్నాడని, ట్రస్టు ద్వారా తమకు మేలు జరుగుతుందని యువతీయువకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధ మయ్యే పేదింటి బిడ్డలకు పీవీఆర్ ట్రస్టు ద్వారా మంచి కోచింగ్ అందిస్తానని వెంకట్రామిరెడ్డి ప్రకటించడాన్ని నిరుద్యోగులు స్వాగతిస్తున్నారు. ఎంతోమంది యువత వివిధ వృత్తులలో నైపుణ్యం లేక అవకాశాలు అందని పరిస్థితులు ఉన్నాయి. అలాంటి వారికి నైపుణ్య శిక్షణ అందించి జాబ్‌మేళాల ద్వారా అవకాశాలు కల్పిస్తామని పేర్కొనడంతో మెదక్ పార్లమెంట్ ప్రజలకు ఆశాకిరణంగా కనిపిస్తున్నారు. కలెక్టర్‌గా విశేష పరిపాలన అనుభవం ఉండటంతో పాటు హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రావీణ్యం ఉండడంతో మెతుకుసీమ సమస్యలను పార్లమెంట్‌లో బలంగా వినిపించే అవకాశం ఉంది.

బాబు కోసం వేంకటేశ్వర స్వామికి తలనీలాలు

వెంకట్రామిరెడ్డి కలెక్టర్‌గా సిద్దిపేటలో పనిచేసే సమయంలో ఆయన బంగ్లాలో బాబు అనే అటెండర్ ఉండేవాడు. వెంకట్రామిరెడ్డి కలెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో గతేడాది మార్చి 2న రాత్రి 11 గంటలకు అపరిచిత వ్యక్తి ఫోన్‌చేసి మీ దగ్గర పనిచేసే బాబుకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగిందని, ఇనుప సలాకలు బాడీలోకి వెళ్లాయని, యశోదా దవాఖానకు తీసుకెళ్తున్నామని వెంకట్రామిరెడ్డికి తెలిపారు. మానవత్వం ఉన్న మనిషిగా స్పందించిన వెంకట్రామిరెడ్డి ఆ విషయం తెలుసుకొని బాధపడ్డారు. వెంటనే రాత్రి యశోదా దవాఖానకు వెళ్లి బాబును చూసి చలించాడు. అతని బాగుకోసం ఎన్ని లక్షలు ఖర్చు అయినా పర్వాలేదని, తాను భరిస్తానని, ఆయన బాగు అయితే అతనితో కలిసి నేను తిరుపతికి వెళ్లి తలనీలాలు సమర్పిస్తామని మొక్కున్నారు. బాబు వైద్యం కోసం రూ.58 లక్షలు ఖర్చు కాగా, వాటిలో రూ.48 లక్షలు భరించి, మిగతా సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందించి ఆపద్బాంధవుడిగా నిలిచారు. బాబు ఆరోగ్యం కుదుట పడిన తర్వాత తిరుపతికి వెళ్లి తలనీలాలు సమర్పించి దవాఖాన వైద్యులకు ప్రసాదం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఎస్సై అయిన మీనా..

ఎమ్మెల్సీగా ఎన్నిక అయిన తర్వాత వెంకట్రామిరెడ్డి ఇంట్లో శుభకార్యం జరిగింది. ఈ సందర్భంగా బందోబస్తుకు వచ్చిన ఒక మహిళా ఎస్సై వెంకట్రామిరెడ్డిని చూడగానే సార్ బాగున్నారా, నేను ఈ పోలీస్ డ్రెస్ వేసుకున్నప్పుడల్లా మీరే కనిపిస్తున్నారని చెప్పడంతో ఆయన ఆశ్చర్యానికి గురయ్యారు. ఏంటమ్మా అని ఆరా తీయగా.. మా పొలం పంచాయితీ ఎక్కడికి వెళ్లినా పరిష్కారం కాకపోవడంతో మీరు జాయింట్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు మీ వద్దకు వచ్చామని, మీకు మా సమస్య చెప్పగానే వెంటనే పరిష్కరించారని గుర్తుచేసింది. 2 ఏండ్లు తిరిగి తిరిగి వేసారి పోయామని, మీమూలంగా సమస్య పరిష్కారం కావడంతో ఒక అధికారి కావాలని మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని ఎస్ఐ అయ్యానని ఆమె గర్వంగా తెలిపింది.

అనాథలను అక్కున చేర్చుకుని..

2014లో సంగారెడ్డిలో వెంకట్రామిరెడ్డి జేసీగా పనిచేస్తున్నారు. ఆ సమయంలో దుబ్బాక మండలం అక్కారంలో తల్లితండ్రులు మరణించడంతో అనాథలైన రాధ, రాధిక అనే ఇద్దరు అమ్మాయిలు ఆయనను కలిశారు. వారి పరిస్థితి చూసి చలించిన వెంకట్రామిరెడ్డి వారిని దత్తత తీసుకొని బాగోగులు చూసుకొని తండ్రిగా అండగా నిలిచారు. సిద్దిపేట రైస్‌మిల్ కార్మికుని కుమార్తె సౌమ్యకు ఎంబీబీఎస్‌లో ర్యాంక్ రాగా, ఫీజు చెల్లించే స్థాయి లేకపోవడంతో ప్రజావాణిలో ఆయనతో మొర పెట్టుకోగా.. సౌమ్యతో పాటు మరు సంవత్సరం ఎంబీబీఎస్ సీటు సాధించిన సోదరికి కూడా ఫీజు చెల్లించి అండగా నిలిచారు. ఇలాంటి ఎన్నో సంఘటనలను కండ్లారా చూసిన వెంకట్రామిరెడ్డి అలాంటి వారికి ఆశా దీపంగా అండగా ఉండటానికే ట్రస్టు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ట్రస్టు ద్వారా ఎంతోమంది పేద యువతీ, యువకులకు కోచింగ్‌తో పాటు వృత్తి నైపుణ్య శిక్షణ అందించనున్నారు. ఏడాదికి రెండుసార్లు జాబ్ మేళాలు ఏర్పాటు చేసి వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. మహిళలకు సైతం కుట్టు మిషన్, అల్లికలు లాంటి వాటిపై శిక్షణ అందించనున్నారు. నిరుపేదలకు ఫంక్షన్‌హాల్లో పెళ్లి చేయడమనేది ఆర్థికంగా భారమైన వ్యవహారం, అందుకోసం 7 నియోజకవర్గాల్లో తలా రూ.2 కోట్లు వెచ్చించి ఫంక్షన్‌హాళ్లు నిర్మించి నిరుపేదలకు ఉచితంగా అందిస్తామంటున్న వెంకట్రామిరెడ్డి సేవా నిరతికి మెచ్చుకోవాల్సిందే. బీజేపీ నుంచి బరిలో ఉన్న రఘునందన్‌రావు దుబ్బాక ఉప ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత హామీలు గంగలో కలవడంతో మొన్న జరిగిన ఎన్నికల్లో చిత్తుగా ఓడించిన విషయం తెలిసిందే. ఇక కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు పార్టీల కన్నా, పదవీ ధ్యాస ఎక్కువని మూడు పార్టీలు మార్చినప్పుడే జిల్లా ప్రజలకు అర్థమైంది. ఉద్యమానికి ఊతమిచ్చిన మెదక్ జిల్లా ప్రజలు మొదటి నుంచి గులాబీ బాస్ కేసీఆర్, హరీశ్‌రావుకు అండగా నిలుస్తూ వచ్చారు. తెలంగాణ ఉద్యమంలో అక్కడక్కడా వాడీ వేడి తగ్గినా ఉమ్మడి మెదక్ జిల్లాలో మాత్రం తగ్గేదేలేనట్లు ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ, ఇక్కడ గులాబీ హవా కొనసాగింది. గత 25 ఏండ్లుగా మెతుకు సీమలో పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జోరు కొనసాగుతున్నది. ప్రజాసేవే పరమావధిగా, భావితరం భవిష్యత్తుకు ఆశా కిరణంలా దూసుకువస్తున్న వెంకట్రామిరెడ్డికి ఎంపీ ఎన్నికలు కలిసి రావాలని ఆశిస్తున్నా.

జీడిపల్లి రాంరెడ్డి ఫ్రీలాన్స్ జర్నలిస్టు
సెల్: 9666680051

మాకు విధులు కేటాయించండి

హుస్నాబాద్‌లో పోలింగ్ విధులు కేటాయించాలని ఆర్డీవోను కోరుతున్న ఉద్యోగులు

హుస్నాబాద్‌టౌన్, మే 12: దూరప్రాంతాలనుంచి వచ్చిన తమకు విధులు కేటాయించాలని, ఎంతసేపు వేచిచూడమంటారని పలువురు ఉద్యోగులు ఎన్నికల అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయమే బయ లు దేరినప్పటికి రహదారి బాగులేనందున ఆలస్యంగా వచ్చామనే కారణంతో తమకు విధులు కేటాయించాలని పలుమార్లు ఉద్యోగులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. కొద్దిసేపు ఉండాలంటూ చెబుతూ ఆగ్రహం వ్యక్తం చేయడంపై పలువురు ఈ విషయాన్ని ఆర్డీవో రామూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. తమకు పీవో, ఏపీవో కాకుండా ఇతర ఏ విధులు అప్పగించినా వెళ్తామని చెప్పడంతో వారికి విధులను కేటాయించాలని ఆర్డీవో రామూర్తి అధికారులకు సూచించారు.

ఉద్యోగుల అసంతృప్తి..

పోలింగ్ విధులకు హాజరవుతున్న సిబ్బంది కోసం ఎండవేడిమి నుంచి తట్టుకునేందుకు అధికారులు కూలర్లు ఏర్పాటు చేశారు. సామగ్రిని అందుకున్న ఉద్యోగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలంటూ అధికారులు పలుమార్లు కోరారు. హుస్నాబాద్ పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంనుంచి వెళ్లకపోవడంతో అధికారులు కూలర్లను ఆపివేయించారు. దీంతో పలువురు ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

బీఆర్ఎస్ దళిత నాయకుడి ఇంట్లో పోలీసుల హైడ్రామా

తనిఖీ చేస్తున్న పోలీసులు, ఎన్నికల సిబ్బంది

సోదాలు చేస్తున్న అధికారులు

సిద్దిపేట, మే12: ఇంట్లో డబ్బులు దాచారని ఫిర్యాదు రావడంతో పోలీసులు బీఆర్ఎస్‌కు చెందిన యువజన విభాగం నాయకుడు, దళిత నాయకుడు జువ్వన్న కనకరాజు నివాసాన్ని ఆదివారం సీజ్ చేసిన సంఘటన సిద్దిపేట పట్టణంలోని రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు కనకరాజు ఇంట్లో డబ్బులు నిల్వ చేశారని సమాచారంతో పోలీసులు ఇంటికి వచ్చారు. అప్పటికే కనకరాజు తన భార్య అనారోగ్యంతో ఉండడంతో చికిత్స నిమిత్తం ఆమెను హైదరాబాద్ యశోద దవాఖానకు తీసుకెళ్లాడు. ఈ విషయమై పోలీసులు కనకరాజును సంప్రదించగా, తన భార్య అనారోగ్యంతో ఉండడంతో తాను హైదరాబాద్ వచ్చానని, అధికారులకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని చెప్పారు. అయినా పోలీసులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆయన ఇంటిని సీజ్ చేసి పోలీస్ పహారా ఏర్పాటు చేశారు.

రెండు గంటల పాటు హైడ్రామా

హైదరాబాద్ నుంచి కనకరాజు రాగానే కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించి ఇంటి తాళాలు తీయాలని కోరారు. సుమారు రెండు గంటల పాటు అనారోగ్యంతో ఉన్న కనకరాజు కుటుంబ సభ్యులను ఇంటి ముందు వెయింట్ చేయించారు. నా ఇంటి తాళం తీయండి, మీ సెర్చ్‌కు తాను సహకరిస్తానని కనకరాజు చెప్పినా పోలీసులు దాదాపు రెండు గంటలు ఆలస్యం చేసి కుటుంబసభ్యులను ఇబ్బందులకు గురిచేశారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు, స్థానికులు భారీగా చేరుకోవడంతో కాస్త ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ అక్కడికి వచ్చి కనకరాజు ఇంటికి వేసిన సీజ్‌ను తొలిగించారు. సిద్దిపేట ఏసీపీ మధుతో పాటు ఎన్నికల అధికారులు, పోలీసులు మీడియా సమక్షంలో కనకరాజు ఇంటిని పూర్తిగా తనిఖీ చేశారు. ఇంటిలోని దేవుడి గళ్లలో వేసిన చిల్లర పైసలు రూ.276 మాత్రమే లభించాయి. ఇంతకుమించి ఏమి దొరక్క పోవడంతో పోలీసులు వెనుతిరిగి వెళ్లారు. బీఆర్ఎస్ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతో రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, కేంద్ర బీజేపీ బీఆర్ఎస్ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

శంకరాచార్య జయంతి

చేర్యాల: పూర్ణాభిషేకం నిర్వహిస్తున్న పురోహితులు

సిద్దిపేట టౌన్,మే 12 : ప్రసిద్ధిగాంచిన పుణ్య క్షేత్రం సిద్దిపేట కోటిలింగాల దేవాలయంలో ఆది శంకరాచార్య జయంతి ఆదివారం వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారిని ప్రత్యేక పూజలు,అభిషేకం చేశారు.శంకరాచార్య జయంతిలో ఆలయ వ్యవస్థాపకులు,ఆలయ కార్యనిర్వహణాధికారి, భక్తులు పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, మే12: చేర్యాల పట్టణంలోని శృంగేరి నగర్ సద్గురు సదన్‌లో జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆది శంకర మందిరంలో ఉదయం స్వామివారికి పూర్ణాభిషేకం, 9గంటలకు మహాలింగార్చన, 10గంటలకు రుద్రహవనం, మధ్యాహ్నం పూర్ణహుతి తదితర కార్యక్రమాలను పురోహితులు జరిపించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, మహన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.సద్గురు సదనం నిర్వాహకులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు సీజ్

సిద్దిపేట టౌన్,మే 12 : ఎన్నికల దృష్ట్యా మద్యాన్ని నిల్వచేసి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుందాం అనుకున్న ఇద్దరు వ్యక్తుల పాచిక బెడిసి కొట్టింది.ఎక్సైజ్ పోలీసుల దాడిలో అడ్డంగా దొరికారు. వారి వద్ద నుంచి మద్యాన్ని ఆదివారం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీనివాసమూర్తి వివరాలు వెల్లడించారు. సిద్దిపేట కాకతీయ నగర్‌లో మల్లారెడ్డి,అమరేందర్‌రెడ్డి ఎనికల నేపథ్యంలో గోవా నుంచి మద్యాన్ని తీసుకొచ్చి ఓ ఇంట్లో నిల్వ ఉంచారనే సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సిద్దిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్,సిబ్బందితో కలిసి రైడ్ చేశారన్నారు. వారి వద్ద నుంచి రూ. 2 లక్షల విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపైన కేసు నమోదు చేశామన్నారు.రైడింగ్‌లో అధికారులు శ్రీధర్,విజయ్, కిరణ్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, అంజయ్య,చెన్న గౌడ్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి,స్వామిరెడ్డి ఉన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

సిద్దిపేట టౌన్/ సిద్దిపేట అర్బన్,మే 12 : బీజేపీ పార్టీకి చెందిన కార్యాలయంలో పోలీసులు ఆదివారం మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని 39 వార్డు గురుకృపా కళాశాల వద్ద బీజేపీ కార్యాలయంలో ఆపార్టీకి చెందిన నేతలు మద్యం నిల్వ ఉంచారని నమ్మదగిన సమాచారం అందిందన్నారు. ఈ మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశామన్నారు. అందులో 4 కాటన్ల మద్యం లభించిందన్నారు. మద్యాన్ని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు బీజేపీ నేతలు రత్నం, శ్రీనివాసులు మద్యాన్ని తీసుకువచ్చినట్లు తెలుస్తుందన్నారు.

'మల్లన్న'ను దర్శించుకున్న భక్తులు

గంగరేగు చెట్టు వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చేర్యాల, మే 12 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు సుమారు 10 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి.శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగుచెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మరి కొందరు భక్తులు స్వామి వారి నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు.మరి కొందరు రాతిగీరల వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శ నం కోసం క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలందించారు.

'మల్లన్న' అన్నదాన పథకానికి విరాళం

విరాళం అందించిన దాతకు రసీదు అందజేస్తున్న ఏఈవో తదితరులు

చేర్యాల, మే 12 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలోని శాశ్వత అన్నదాన పథకానికి మేడ్చల్ జిల్లా ఘటకేసర్‌కు చెందిన పులిపాక దేవమణిఅర్జున్ దంపతులు రూ. లక్షా116 ఆదివారం విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ ఏఈవో దేవమణిఅర్జున్ దంపతుల నుంచి విరాళం తీసుకుని వారికి రసీదు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు మహాదేవుని మనోహర్, సిబ్బంది మధుకర్, మాధవి ఉన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవేందర్‌నాయక్

మద్దూరు(ధూళిమిట్ట), మే12: ఫార్మసిస్టు సంక్షేమ సంఘం (ఎఫ్ఎస్ఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ శివాలి తండాకు చెందిన లకావత్ దేవేందర్ నాయక్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణగౌడ్ తెలిపారు.

అనర్థాలపై అవగాహన

మద్దూరు(ధూళిమిట్ట), మే12: మద్దూరు మండలంలోని రేబర్తిలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఆదివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పేపర్ ప్లేట్లకు బదులు మోదుగు ఆకులతో మహిళా సంఘం సభ్యులు తయారు చేసిన ఇస్తారాకుల్లో గ్రామస్తులకు అల్పాహారాన్ని అందించారు. పంచాయతీ కార్యదర్శి మాధవ్, ఎఫ్ఏ ఐలయ్య, సీఏలు జయమ్మ, సబిత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, నిర్మల, అనురాధ, ఆశ కార్యకర్తలు యశోద, కవిత, కనకలక్ష్మి పాల్గొన్నారు.

బియ్యంతో ఈవీఎం

బియ్యంతో ఈవీఎం

గజ్వేల్, మే 12: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటర్లను చైతన్యపర్చాలనే ఉద్దేశంతో గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామరాజు బియ్యంతో ఈవీఎంను ఆదివారం రూపొందించాడు. ప్రతి పౌరుడికి 'ఓటే వజ్రాయు ధం.. నిజాయితీగా ఓటేద్దాం' అంటూ సోమవారం జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ దేశ భవిష్యత్ కోసం తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని కోరారు.